నాతో చెప్పారు. ఇక్కడే వుండండి వారు వస్తారు.' అన్నాడు.

నాకు చాలా ఆశ్చర్యమైంది. ఆ రాజు గారి పేరు వినడమే గాని నేనెప్పుడూ చూడలేదాయన్ని. పైగా మేము మద్రాసు వెళ్లే దారిలో పాండిచ్చేరి తగలడం వల్ల కాకతాళీయంగా ఆశ్రమానికి రావడం జరిగిందే గాని ప్రయత్న పూర్వకంగా కాదు అలాంటిది రాజుగారిలా చెప్పడమేమిటని ఆశ్చర్యపోతూ 'రాజుగారెక్కడున్నారు' అన్నాను

అదిగో. అదే వారి ఆఫీసు అని చూపిస్తూ కావాలంటే పోయి అడిగి. చూడండి' అంటూనే వెళ్ళిపోయాడతను.

సరేనని ఆ ఆఫీసుకు వెళ్ళి రాజుగారిని గురించి అడిగాను.

నేనేనని అక్కడ కూర్చున్న ఒకాయన అన్నారు.

మేము మద్రాసునుండి వేలాంగన్ని వెళ్ళి వస్తూ యిలా వచ్చామనీ. ఫలానా అని చెప్పాము. ఆయనా మమ్మల్ని గురించి విని యున్నారే గాని ఎప్పుడూ చూడలేదు. సరే పరిచయాలయ్యాక 'ఇది ఆశ్రమంలో భోజనాల టైము. మీరు ఆశ్రమ భోజనం భోంచేసేటట్లయితే రండి అన్నారు.

అంతకంటేనా! అని ఆశ్రమ భోజనం అంటే అక్కడి ప్రసాదంగా భావించి వెళ్ళాము.

వెళ్తూ దారిలో "మేము వస్తున్నట్లు మీకు ముందుగా తెలుసా. అనడిగాము. తెలియదన్నారాయన. అప్పుడు ఒకతనిలా మమ్మల్ని మీరు కొంచెం సేపు వెయిట్ చెయ్యమన్నారని చెప్పాడు. అతనే మీరుండే చోటు చూపించాడు అని విషయమంతా చెప్పాము. ఆయనా ఆశ్చర్యపోతూ తనకేమీ తెలియదన్నారు.

ఇక ఇదేదో దైవ సంకల్పమనిపించింది "భగవంతుడు కొన్ని పరిస్థితులలో మనకు సహాయపడదలచుకుంటే" శంఖ చక్ర. గదా ధరుడై. పీతాంబరధారియై వచ్చి సహాయపడడు ఏదో రూపంలో వచ్చి సహాయంచేస్తాడు. అనే పెద్దల వచనానికి నిదర్శనం ఇదే కాబోలు. అనిపించింది

భోజనాల హాలు చాలా పెద్దది. ఆశ్రమవాసులకు అతిధులకు అందరకు ఒకే రకమైన భోజనం బైటనుండి ఇలా ఆశ్రమం చూడటానికి వచ్చిన వారు మాత్రం భోజనానికి మనిషికి ఒకరూపాయి టిక్కట్టు తీసుకోవాలి. రుచిమైన భోజనం. క్రమ పద్ధతిలో వడ్డన జరుగుతోంది. మాకు కావలసినవి తెచ్చుకొని డైనింగ్ టేబుల్స్ వద్ద కూర్చొని భోంచేసాము. అంతటా అతి శుభ్రంగా వుంది. చాలా కాలంగా అక్కడే స్థిరపడిన ఆశ్రమ వాసులకు వారి వారి యిష్టాన్ని బట్టి ఇదే భోజనం వసతి గృహాలకు పంపిస్తారట. కొంత మంది ఆ డైనింగ్ హాలుకే వచ్చి భోం